ప్రజాశక్తి
గురువారం 7 సెప్టెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి

కార్మికుల ఆందోళనకు వైసిపి మద్దతు

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని గురునానక్ పరిశ్రమ నిర్వహకులు కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్‌తో చేస్తున్న ఆందోళనకు వైసిపి నాయకులు మద్దతు పలికారు. కార్మికులు మూడు రోజులుగా పరిశ్రమ ముందు ఆందోళన చేస్తున్నారు. బుధవారం పరిశ్రమ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులకు వైసిపి నాయకులు తిప్పేరుద్రయ్య మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కార్మికుల పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరం అన్నారు. సమస్యను కార్మిక శాఖ అధికారుల దృష్టికి తీసుకుపోయికార్మికులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్, వైసీపీ నాయకులు రంగనాథ్, శ్రీకాంత్, సతీష్, చంద్ర, రమేష్, శివప్ప పాల్గొన్నారు.

పరిశ్రమ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

◆ రాష్ట్రంలో రివర్స్ పాలన

◆ ఒక్క అవకాశంతో ఏపీ సర్వనాశనం

◆ టిడిపి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

◆ టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు

◆ 2వ రోజు రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో పర్యటన

కౌకుంట్ల వద్ద డ్రిప్ ఇరిగేషన్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు నాయుడు

దోపిడీ పాలనను తరిమేద్దాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం, రాయదుర్గం

అవినీతి, అక్రమాలు సాగిస్తున్న దోపిడీ ప్రభుత్వం వైసిపిని రాష్ట్రం నుంచి తరిమేద్దామని టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. భవిష్యకు ష్యూరిటీ - బాబు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు చంద్రబాబు రాయదుర్గం, కళ్యాణదుర్గంలో పర్యటించారు. మధ్యలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కుమారుడు వివాహ రిసెప్షన్ జరుగుతున్న కౌకుంట్ల గ్రామానికెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. ఉదయం రాయదుర్గం పట్టణంలో పల్లె ప్రగతి కోసం ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఇందులో యువత, మహిళలు, రైతులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, మేధావులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాయంత్రం కళ్యాణదుర్గంలో పర్యటించారు. ఒంటిమిద్ది గ్రామ సమీపంలో అర్థాంతరంగా ఆగిన హంద్రీనీవా కాలువ పనులు, లిఫ్టు పరికరాలను పరిశీలించి సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. రాత్రి టీ సర్కిల్‌లో నిర్విహిచిన బహిరంగ సభలో ప్రసంగించారు. వైసీపీ పాలన ఆరంభం నుంచి అరచాకాలు, దోపిడీలు, దౌర్జన్యాలతో సాగుతోందన్నారు. రాష్ట్రభవితవ్యాన్ని భ్రష్టుపట్టించారని ఎద్దేవాచేశారు. అడుగడుగునా వైసీపీ నేతలు అరచకాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పథకాలన్నీ నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని సంక్షభంలోకి నెట్టవేసిన ప్రభుత్వం వైసిపి అన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం రైతాంగం కోసం రూ.968 కోట్లతో బీటీపీ ప్రాజెక్టుకు నీళ్లందించేందకు హంద్రీనీవాను ప్రారంభించి 26శాతం పనులు పూర్తి చేస్తే ఎన్నికల అనంతరం ఒక గంప మట్టిని కూడా తీసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. సిగ్గులేని ముఖ్యమంత్రి తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నట్టేట ముంచారని ఆక్రోశం వెళ్లగక్కారు. జిల్లా అభివృద్ధి కోసం జీడిపల్లి, గొల్లపల్లి రిజర్వాయర్లు పూర్తి చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే దక్కిందని గుర్తుచేశారు. బిందు, తుంపర సేద్యం పరికరాలను నాడు 90శాతం సబ్సీడీతో రైతాంగాన్ని ఆదుకున్న ఘనత టీడీపీదే అన్నారు. నాడు మద్యపాన నిషేదం అంటూ నేడు విచ్చలవిడిగా మ్యదం విక్రయిస్తూ దోపిడికీ పాల్పడుతున్నారన్నారు. మంత్రి ఉషాశ్రీచరణ్ సుజలాన్ కంపెనీ ప్రతినిధులను బెదిరించి 160 ఎకరాల భూమిని ఎకరం రూ.లక్షతో కొనుగోలు చేశారని ఆరోపించారు. అదేభూమిని తాను లక్షకు కొనుగోలు చేసి పేదలకు పంచిపెడతానిని అందుకు మంత్రి ఉషాశ్రీచరణ్ సిద్ధమా అని ప్రశ్నించారు. సైకో సీఎం పోవాలంటే ఇంటికో సైనికుడు తయారై టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమంత రాయచౌదరి, ఉమామశ్వరనాయుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, పార్థసారథి, పరిటాల శ్రీరాం, గుండుమలతిప్పేస్వామి, మధుమంచి స్వరూప, మోరేపల్లి మల్లికార్జున, రామ్మోహన్‌చౌదరి, చంద్ర దండు ప్రకాష్‌నాయుడు, మారుతీచౌదరి, వైపి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై అప్పుల వల

◆ ట్రాక్టర్ పేరుతో రూ.2 కోట్లకు పైగా రుణాల భారం

◆ ఫైనాన్సియర్, ట్రాక్టర్ షోరూం యజమానులు కలిసి మోసం

◆ లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పేదల అమాయకత్వం, బలహీనతలను ఆసరాగా చేసుకుని వలపన్నీ మాయమాటలతో రుణ భారాన్ని నెత్తిన మోపుతున్న ఘటనలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా కదిరి ప్రాంతంలో ఒక కార్పొరేట్ ఫైనాన్స్ సంస్థ, ట్రాక్టర్ షోరూమ్ యజమానాలు, మధ్య దళారీలు కలసి అమాయక నిరుపేదలపై రుణభారాన్ని మోపుతున్నారు. ఈ రుణం చెల్లించాల్సిన సమయం వచ్చినప్పుడు అసలు విషయం తెలిసి మోసపోయిన అమాయకులు లబోదిబోమంటున్నారు. ఈ రకంగా కదిరి పట్టణంలోని ఒక్క షోరూమ్ పరిధిలోనే సుమారు 30 ట్రాక్టర్లను ఇచ్చి మాయం చేసి సుమారు రెండు కోట్లకుపైగా అప్పును పేదలపై మోపారు. ఇప్పుడు ఈ ట్రాక్టర్లు ఎక్కడున్నాయో కూడా రుణం తీసుకున్న వారికి తెలియకపోవడం గమనార్హం.

అంతా పక్కా పథకం ప్రకారమే

ఎక్కడైనా రుణమివ్వాలంటే సవాలక్ష విచారించి, అన్నీ సక్రమంగా ఉంటేనే ఇస్తారు. రుణం తీసుకునే వ్యక్తి ఏ రకంగా చెల్లించగలుగుతాడు, ఆయన ఆర్థిక స్థితిగతులేమిటి అన్న వివరాలు తెలుసుకుని రుణం ఇవ్వటం పరిపాటి. ఇక్కడ మాత్రం ఏమీ లేకుండానే పేదల అమాయకత్వాన్ని గుర్తించి కార్పొరేట్ ఫైనాన్స్ సిబ్బంది, షోరూమ్ యజమాని, గ్రామీణ స్థాయిలో ఇటువంటి వారిని గుర్తించే మధ్య దళారీ కలగలసి ఈ వ్యవహారాన్ని పక్కా పథకం ప్రకారం నడిపారన్న ఆరోపణలున్నాయి. పూర్తిగా నిరుపేదలుగా ఉండి ఏమీలేని వారికి కొంత మొత్తం ముట్టజెప్పి షోరూమ్ వరకు మధ్య దళారీ తీసుకొస్తాడు. షోరూమ్ యాజమాని, ఫైనాన్స్ సంస్థ సిబ్బంది నీకేమి కాదంటూ సంతకాలు తీసుకుని ఆయన పేరు మీద ట్రాక్టర్‌కు పూర్తి ఫైనాన్స్‌ను చేస్తారు. సంతకాలన్నీ తీసుకున్నాక అతడిని ఇంటికి పంపుతారు. వాస్తవానికి రుణం పొందిన వ్యక్తికి ట్రాక్టర్ కూడా అందజేయరు. దీన్ని మరో వ్యక్తికి అక్కడే లక్ష నుంచి రెండు లక్షలు తీసుకుని అమ్మేస్తారు. దానికి సంబంధించిన వివరాలు కూడా షోరూమ్ యజమాని వద్ద ఉండవు. కొంత సమయం తరువాత ఫైనాన్స్ సంస్థకు సంబంధించిన రికవరీ బృందాలు రుణం చెల్లించాలని వెళ్లిన సమయంలో బాధితులకు అసలు విషయం తెలుస్తోంది. పూటగడవటమే కష్టంగానున్న తాము ఇంత పెద్ద అప్పును ఏ రకంగా చెల్లించగలమని లబోదిబోమనే పరిస్థితి నెలకొంటోంది.

ఈ ఫొటోలో కన్పిస్తున్న వ్యక్తి పేరు దొడ్డప్ప. ఇతను రోజు కూలి. ఇతని పేరుపై ఓ ట్రాక్టర్‌ను తీసుకున్నారు. ప్రస్తుతం ఇతని పేరుపై రూ.8 లక్షల అప్పు ఉంది. ఈ అప్పు కట్టాలని రికవరీ సిబ్బంది ఆయన ఇంటికి రావడంతో ఆయన తనకేం తెలియదని, అసలు ట్రాక్టరే తన వద్ద లేదని చెప్పాడు.

ఎవరూలేని దొడ్డప్పకు ఎనిమిది లక్షల రుణం

ఓబుళదేవరచెరువు మండలం వీర ఒబన్నగారిపల్లి గ్రామంలో దొడ్డప్ప అనే వ్యక్తి ఉన్నాడు. ఇతడికి భార్య, పిల్లలు ఎవరూలేరు. వ్యవసాయ భూమి కూడా 80 సెంట్లకు మించి లేదు. వ్యవసాయ కూలీ పనులకెళ్తేగానీ పూటగడవదు. మద్యం సేవించే అలవాటూ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని ఆ వ్యక్తిని ప్రలోభపెట్టి కదిరి పట్టణంలోని జాన్‌డీర్ షోరూమ్‌కు తీసుకెళ్లారు. ఆయనతో సంతకాలు తీసుకోవడం అన్నీ పూర్తి చేసి రుణం మంజూరు చేశారు. సదరు వ్యక్తి ట్రాక్టర్‌ను ఇంటికి కూడా తీసుకురాలేదు. ఆయన పేరు మీద పూర్తి ఎనిమిది లక్షలు ఫైనాన్స్ చేశారు. వాహనం మాత్రం ఆయనకు అప్పగించలేదు. దీన్ని కదిరి ప్రాంతంలోనే మరో వ్యక్తికి అమ్మేశారు. ఇప్పుడు ఎనిమిది లక్షలకు సంబంధించి కట్టాల్సిన వాయిదాల కోసం రికవరీ బృందం ఇంటికెళితే తనకు అంత రుణమిచ్చినట్టు తెలియదని దొడ్డప్ప చెబుతున్నాడు. ఈ విషయం ప్రజాశక్తి దొడ్డప్పను అడుగగా 'మా ఊరి రెడ్డి పిలుచుకుపోతే పోయాను. ట్రాక్టర్ చూశాను. అయినా నాకు ట్రాక్టర్ వద్దని ఆ రోజే చెప్పి.. ఇంటికొచ్చాను.' అని దొడ్డప్ప తెలిపాడు. ఇలా ఈ ప్రాంతంలోనే సుమారు 30 మంది వరకు ఇదే రకమైన బాధితులున్నట్టు సమాచారం. వారందరూ ఇప్పుడు తమకు తెలియకుండానే అప్పులు ఎలా వచ్చిందంటూ తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంలో పోలీసులను ఆశ్రయిస్తామని బాధితులు చెబుతున్నారు.

నిర్ధిష్ట ప్రణాళికతో ముందుకెళ్తాం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

రాయదుర్గంలో ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - రాయదుర్గం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ స్థానానికి తీసుకువచ్చేలా నిర్ధిష్టమైన అభివృద్ధి సంక్షేమ ప్రణాళికతో ముందుకు వెళ్తామని టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలకు వివరించి వారి ఆశీర్వాదంతో విజయం సాధిస్తామని తెలిపారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని రాయల్ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గస్థాయి ప్రముఖులు, మేధావులతో చంద్రబాబు బుధవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సైకో జగన్ ప్రతిపక్షాలు, ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. తనతో పాటు కాలవ శ్రీనివాసులు, టిడిపి నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై గళం ఎత్తే వారిపై తప్పుడు కేసులు పెట్టడమే పాలన అన్నట్లు జగన్ ప్రవర్తిస్తున్నారని చెప్పారు. నేరం చేయడంలో ఆయన మాస్టర్ డిగ్రీ పొందాడన్నారు. వైఎస్.వివేకానందరెడ్డి హత్యకేసులో ఇదే నిర్ధారణ అయ్యిందన్నారు. తనపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపే కుట్ర సాగుతోందన్నారు. తాను రాష్ట్రంలో నీటిపారుదల రంగంలో జరుగుతున్న నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలను నిలదీసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నానని చెప్పారు. బిటిపి, పేరూరు ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయలేదన్నారు. హంద్రీనీవా నీరు చిత్తూరు, పుంగనూరు, కుప్పం ప్రాంతాలకు తీసుకెళ్లక, వాటికి సమాంతర కాలువ పేరిట 5400 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఆయన అనుయాయులకు ఆ పనులను జగన్ కట్టబెట్టారన్నారు. పుంగనూరులో ఎలాంటి డిపిఆర్ లేకుండా కృష్ణ వాటర్ బోర్డ్ అనుమతి లేకుండా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్ 3500 కోట్ల రూపాయల ఖర్చుతో చేశారన్నారు. ఎలాంటి నీటి కోటా లేకుండా వేలకోట్ల రూపాయల పనులు ఎలా చేపడతారని చంద్రబాబు ప్రశ్నించారు. రైతులకు చెప్పకుండా, వారికి పరిహారం ఇవ్వకుండానే పొలాల్లో కాలువలు కూడా తవ్వారన్నారు. తాను చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తే తనపైనే దాడి చేసి తానే హత్యాయత్నం చేశానని తనపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తులకు తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిచామని చెప్పారు. ఈ పథకాలకు జగన్ పేరుమార్చి బటన్ నొక్కాడు కార్యక్రమం మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. సైకో జగన్ పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆగస్టు నెలలో 122 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో చినుకు జాడలేని దుర్భిర పరిస్థితులు వచ్చాయన్నారు. రంగాల్లో రాష్ట్ర ప్రజలు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు తమ పార్టీ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని చెప్పారు. సౌర, పవన, జల విద్యుత్ ఆధునిక విధానాన్ని అమలు చేసి రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా చేస్తామన్నారు. 2047 సంవత్సరం నాటికి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉండేలా తాము నిర్దిష్ట ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. మరో నాలుగు, లేదా ఆరు నెలల్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయని ప్రజలు తమకు అండగా ఉండాలని చంద్రబాబు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో పాటు వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్రను విజయవంతం చేయండి

పజాశక్తి - పరిగి

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జూడో యాత్ర సంవత్సరం పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సంఘీభావ పాద యాత్రను విజయవంతం చేయాలని ఎఐసిసి మెంబర్ కెటి శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే పాదయాత్ర సేవామందిర్ నుండి హిందూపురం ఇందిరాగాంధీ సర్కిల్ వరకు నిర్వహించి అనంతరం బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ పాదయాత్రలో నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోరంట్ల నరసింహులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జగన్నాథ్ రెడ్డి, శివశంకర్, ఈశ్వరప్ప, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో ఎవరికి అందలం..?

కష్టకాలంలో జెండామోసిన వారికా.. ఆర్థిక బలం ఉన్నవారికా..!

సిద్ధారెడ్డి
పూల శ్రీనివాసులు
పవన్‌కుమార్‌రెడ్డి
బత్తల హరిప్రసాద్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వైసిపి ప్రారంభం నుంచి కదిరి నియోజకవర్గంలో ఆ పార్టీ అభివృద్ధి కోసం కొందరు నాయకులు నిరంతరం పని చేశారు. వారి భుజస్కంధాలపై జెండాను మోసి గ్రామాల్లోకి పార్టీని తీసుకెళ్లారు. ఇలాంటి చాలా మంది నేతలు ప్రస్తుతం అధిష్టానం గుర్తింపు లేక సాధారణ నాయకుల మాదిరే ఉండిపోతున్నారు. ఆర్థిక బలం ఉన్న వారికే పార్టీలో గుర్తింపు లభిస్తోందని కొందరు నాయకులు వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి, మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులు, వాల్మీకి అధినేత, నియోజకవర్గ వైసిపి నాయకులు పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్‌లు ప్రజల మధ్య ఉంటున్నారు. నియోజకవర్గంలో వైసిపి అభివృద్ధిలో వీరి కృషి చేసి ఏదో రూపంలో ఉంది. కరోనా, వరదల సమయంలో ప్రజలకు అండగా నిలబడి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ఇదిలా ఉండగా ఇటీవల కదిరి వైసిపి రాజకీయాల్లో కొత్త పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆర్థిక బలం ఉన్నవారు పార్టీలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. వీరంతా ఎలాగైనా అధిష్టానంను ప్రసన్నం చేసుకుని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్టు పొందాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కులం సమీకరణలను ముందుకు తెచ్చి కదిరిలో అత్యధికంగా ఉండే ఓ సామాజిక వర్గం నాయకున్ని తెరపైకి తేవాలనే ప్రచారం ఇటీవల ఆ పార్టీలో ఎక్కువగా కన్పిస్తోంది. దీనిని అదే సామాజిక వర్గం నేతలు కూడా వ్యతిరేస్తున్నారు. ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చినంత మాత్రానా వారికి కోసం పని చేస్తామా అంటూ ఆ సామాజిక వర్గం నాయకులే బహిరంగ విమర్శలు చేస్తున్నారు. కదిరి నియోజక వర్గం వైసిపికి కంచుకోటనే చెప్పాలి. వైసిపి పోటీ చేసిన రెండు పర్యాయాలు ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలు పొందారు. ఇలాంటి పరిస్థితుల్లో కదిరి వైసిపి టికెట్టు తెచ్చుకునేందుకు ఆ పార్టీలో పెద్ద ఎత్తున నేతలు ఉత్సాహం కనబరుస్తున్నారు. వైసిపి బీఫామ్‌తో పోటీ చేస్తే గెలుపు తమదే అన్న ధీమాతోనే నేతలు ఉన్నారు. అధిష్ఠానం మాత్రం అభ్యర్థి ఏవరన్న దానిపై ఇప్పటి వరకు స్పష్టమైన సంకేతాలు ఏవీ ఇవ్వడం లేదు. నేతలు మాత్రం ఎవరికి వారు తామే అభ్యర్థులం అంటూ వారి అనుచరుల వద్ద చెప్పుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధిష్టానం ఇంతకాలం కోసం పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తిస్తుందా..? లేక ఆర్థిక మూలాలు ఉన్న వారిని బరిలోకి దింపుతుందా.? అన్నది వేచి చూడాల్సి ఉంది.

కలెక్టర్ చొరవతో దశాబ్దాల నాటి పేదల సమస్య పరిష్కారం

గుడారాల్లో జీవిస్తున్న సంచార జాతులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

దశాబ్దాలుగా ప్రభుత్వ సంక్షేమాలకు దూరమై గ్రామ పొలిమేరల్లో గుడిసెలలో నివాసం ఉంటున్న సంచార జాతుల కుటుంబాల సమస్యల స్థానిక కలెక్టర్ అరుణ్ బాబు చొరవతో పరిష్కారమైంది. దీంతో పేదల ముఖాల్లో ఆనందం వెల్లువెలిసింది. కర్నాటక, చిలమత్తూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పేదలు సత్యసాయి జిల్లాలోని కొత్తచెరువు సమీపంలో ఎన్నో ఏళ్లుగా డేరాలు ఏర్పాటు చేసుకుని గుజిరి వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ప్రభుత్వ పథకాలు అందాలంటే ఆధార్ కార్డులు ఉండాలి. ఆధార్ కార్డులు కావాలంటే జనన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. ఇవేవీ లేకుండా ఇళ్ల స్థలాలు రావు. పక్కా గృహాలు మంజూరు కావు. పింఛన్లు, రేషన్ బియ్యం ఇవేవీ రావు. దీంతో పేదలు వీటన్నింటికీ దూరంగా ఉంటూ ప్లాస్టిక్ కవర్లు సేకరించడం, చెంప పిన్నీలు, చెక్క దువ్వెనలు విక్రయించడం, వెంట్రుకలు సేకరించడం తదితర పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఆధార్ కార్డులు ఎలా పొందాలో తెలియదు. నాగరికత ఎంతో పెరిగిన ఈ ఆధునిక యుగంలో కూడా జీవన విధానంలో పూర్తిగా వెనుకబడి ఉన్నారు. ఇదేమిటి అని ఎవరైనా అడిగితే 'ఇది మా కర్మ, మా తలరాత' అంటూ అవేదన వ్యక్తం చేసేవారు. దశాబ్దాలుగా వారు డేరాలతోనే జీవిస్తున్నారు. వారికి ఓటు హక్కు లేనందున ఎన్నో ప్రభుత్వాలు మారినా, పాలకులు వీరి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కొత్త చెరువులో కొండ సమీపంలో డేరాలలో బిక్కుబిక్కుమంటూ 74 కుటుంబాలు కాలం వెళ్లబుచ్చుతున్నాయి. వారికి ఓటు హక్కు లేకపోవడం కూడా ప్రధాన కారణం కనిపిస్తోంది. వారికి తమ బ్రతుకులు మెరుగుపరుచుకోవాలన్న ఆలోచన కూడా రాలేదు. ఉదయం లేస్తూనే గ్రామాల వెంట వెళ్లడం తమకు జీవనాధారమైన చిరు వ్యాపారాలు చేసుకోవడం సాయంత్రానికి గుడారాలకు చేరుకోవడం మాత్రమే తెలుసు. ఈ నేపథ్యంలో కొందరు వారికి సలహా ఇచ్చారు. 'మీరు మొట్టమొదట జనన ధ్రువీకరణ పత్రాలు పొందండి. తద్వారా ఆధార్ కార్డులు పొందుతారు.. లేకుంటే మీ బ్రతుకులు మారవు' అని చెప్పారు. అంతేకాకుండా కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించుకోవాలని సూచించారు. దీంతో వారిలో కొంత చలనం ఏర్పడింది. దీనికి తోడు జిల్లా కేంద్రం కొత్తచెరువు 12 కిలోమీటర్లు మాత్రమే ఉండటంతో వారు గత సోమవారం నిర్వహించే స్పందన గ్రీవెన్స్ లో తమ గోడును జిల్లా కలెక్టర్ ముందు వెల్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన కలెక్టర్ అరుణ్ బాబు జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి ఆధార్ కార్డు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక రెవెన్యూ అధికారులను, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఇంకేముంది ఆగమేఘాల మీద అధికారులు వారికి జనన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సోమవారం అర్జీలు ఇచ్చిన వెంటనే మంగళ, బుధవారాల్లో 74 కుటుంబాలకు జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. దీంతో ఆధార్ కార్డు పొందడానికి సులభతరమైంది. దీంతో పేద సంచార జాతులవారి ముఖాల్లో ఆనందం వెల్లి విరిసింది. జిల్లా కలెక్టర్‌కు వారంతా కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకు ఏ అధికారి స్పందించలేదని ఇప్పుడు కలెక్టర్ చొరవతో సంక్షేమ పథకాలు పొందడానికి సులభమైందని, ఓటు హక్కు కూడా పొందుతామని సంతోషం వ్యక్తం చేశారు.

కలెక్టర్ చొరవతో సమస్య పరిష్కారం

నా వయసు 45 సంవత్సరాలు. ఇంతవరకు ఆధార్ కార్డు లేదు. ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందలేదు. ఆధార్ సెంటర్ కు పోతే జనన ధ్రువీకరణ పత్రం తెమ్మంటారు. అది ఎవరు ఇస్తారో తెలియదు. కలెక్టర్ దయవల్ల అన్నిటికీ ఆధారమైన జనన ధ్రువీకరణ పత్రాన్ని అధికారులు అందజేశారు. ఆధార్ కార్డు కూడా ఇప్పిస్తామన్నారు.

క్రిష్టప్ప

పింఛను రాలేదు

నా వయసు 60 సంవత్సరాలు. అయినా పింఛను రాలేదు. పింఛను కోసం తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలకు వెళితే ఆధార్ కార్డు తెమ్మంటారు. అధికారులు చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయాను. ఎక్కడికి పోవాలో ఎవరిని అడగాలో తెలియక ఇక నా కర్మ ఇంతేలే అని ఊరుకుండిపోయాను. కలెక్టర్ చొరవతో నాకు న్యాయం జరుగుతోంది.

సుంకమ్మ

ఆలయ నిర్మాణానికి విరాళం

తలుపుల : ఏటి గంగమ్మ ఆలయ అభివృద్ధికి మండలానికి చెందిన దాత విరాళం అందజేశారు. మండలంలోనిబురుజు పల్లికి చెందిన చింతకుంట రాజారెడ్డి, పద్మావతమ్మ ఆలయ ఆవరణంలో స్టేజీ నిర్మాణానికి రూ. 1. 50 లక్షలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతమనేని గోపాల్ రెడ్డి, చిన్నపరెడ్డి, ప్రభు ప్రతాప్ రెడ్డి, ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి మడకశిర

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ టిఎన్‌పియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని రోళ్ళ మండలం మల్లినమడుగు పంచాయతీ కాల్వేపల్లి, మల్లినమడుగు గ్రామాల్లో చంద్రబాబు బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన భవిష్యత్తు కు గ్యారంటీ లోని సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న , క్లస్టర్ ఇన్‌ఛార్జి భరత్, యూనిట్ ఇన్‌ఛార్జి యంజారప్ప, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి నివాళి

ప్రజాశక్తి -పెనుకొండ

మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి జయంతిని టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొండంపల్లి గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మతో పాటు రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం పట్టణంలోని ఎన్ టి ఆర్ సర్కిల్ వద్ద గల సవితమ్మ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి,కదిరి
O.S.NO.198/2021

Between:-
ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, Kadiri Main Branch వారు, Rep by its Senior Manager Kadiri ...**Plaintiff**

మరియు

D1 M.ఇంతియాజ్ ఖాన్ తండ్రి అయూబ్ ఖాన్, R/at వలి సాబ్ రోడ్, కదిరి పట్టణము మరియు మండలము, శ్రీ సత్యసాయి జిల్లా.
D2 S.నాదిర్ బాషా తండ్రి అబ్దుల్ బాషా, R/at టంగుటూరు ప్రకాశం స్ట్రీట్, కదిరి పట్టణము మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...**Defendants**

పై దావాలోని D1 మరియు D2 ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలోని వాది (ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, Kadiri Main Branch వారు) ప్రతివాది D1 మరియు D2 అయినా మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 13/09/2023వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున మీరు 13/09/2023వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను.లేనిచో ఘనమైన కోర్టు వారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా:13/09/2023
స్థలం:కదిరి **జి.గురులింగస్వామి B.A., B.L, వాది తరుపు వకీలు, కదిరి**

మహారాజశ్రీ కదిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO.558/2021

Between:-
బుసిరెడ్డి రమణారెడ్డి ...వాది
యెదరి
గంగినేపల్లి నారాయణ @ నారాయణప్ప ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను నోటీసు

To
గంగినేపల్లి నారాయణ @ నారాయణప్ప తండ్రి గంగినేపల్లి గంగప్ప, సంగీతంపల్లి, H/o మహమ్మదాబాద్, కస్సముద్రం పోస్ట్, అమడగూరు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
ఇందుమూలంగా ప్రతివాదికి తెలియచేయునది ఏమనగా వాది తనకు రావలసిన దావా ప్రాంసరి బాకీ నిమిత్తము పై దావాను దాఖలు చేసి యున్నాడు. నీ హాజరు నిమిత్తము 29/09/2023వ తేదికి వాయిదా వున్నది. నీకు అభ్యంతరములు ఉన్న యెడల పై తేదిన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 గం॥లకు హాజరై అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమున దావా తీర్మాణము చేయబడును అని తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా:29/09/2023
స్థలం:కదిరి **బందారు క్రిష్ణమూర్తి వాదితరుపు న్యాయవాది, కదిరి సెల:9618465758,,**

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా
O.S.NO.817/2022

Between:-
యస్.మోహన్ రాయుడు తండ్రి నారాయణస్వామి R/o డోర్ నెం:2-147, జొన్న స్ట్రీట్ కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది
యెదరి
కాసబత్తిని శ్రీనివాసులు తండ్రి లేట్ కె.గంగయ్య R/o డోర్ నెం:3-27-A-4-1, కోనేరు స్ట్రీట్ కదిరి పోస్టు, కదిరి టౌన్,(మం) శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

ఇందుమూలంగా తెలియచేయడం ఏమనగా పైన తెలిపిన వాది, ప్రతివాదిపై ప్రాంసరి నోటు బాకీ వసూలు నిమిత్తము పై కోర్టు నందు దావా వేసి వున్నారు. పై దావా వాయిదా తేది:18/09/2023న ఉదయం 10:30 నిమిషాలకు పైన తెలిపిన కోర్టు నందు ప్రత్యక్షముగా గానీ లేదా వకీలు ద్వారా హాజరై నీ యొక్క వాదనలు, అభ్యంతరములు తెలియపరుచుకోవలెను. అట్లు హాజరు కాని యెడల పై దావా నీ యొక్క పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా:18/09/2023
స్థలం:కదిరి
ఎ.క్రిష్ణమూర్తి M.A., L.L.B., వాదితరుపు న్యాయవాది, కదిరి సెల్:9440310692, 8886389692.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE:PENUKONDA,
I.A 217/94 O.S. 17/86

Between:-
D.Sailaja @ Sivamma, Represented by D.V. Rangareddy Special Power of attorney holder ...**Petitioner/plaintiff,**
And
K.Narayanareddy died by Lrs, and others, ...**Respondent/defendants**

To
R.80: G. Ramireddy S/o Gollapalli Bayapareddy aged about 35 years,
R.82:K.Sreeramireddy S/O kalukurthi Narayanareddy aged about 45 years,
both are Hindus, residents of Marala vil., of Bukkapatnam mandal.,

Notice to respondents 80 and 82

Where as the petitioner/plaintiff instituted the above petition against you and others for passing final decree in O.S.17/86 on the file of the Senior Civil Judge, Penukonda, and you are hereby summoned to appear before this Hon'ble Court in person or by a pleader on the 12-09-2023 at 10-30 A.M. to answer the same, failing which the matter will be disposed of ex parte.

(By order of the Court)

Hearing Date:12/09/2023
M.SREENIVASULU Advocate for the petitioner/plaintiff, Penukonda.

ఆలయ భూములను పరిరక్షించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఆలయ భూములను పరిరక్షించాలంటూ పట్టణంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం ఎదురుగా ఉన్నా ఆలయ భూమిలో కొందరు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. హిందూపురం పట్టణ నడిబొడ్డులో ఉన్న అనంత పద్మనాభ స్వామి దేవాలయ భూములు ఇటీవల కొందరు కబ్జా చేసేందుకు పెద్ద ఎత్తున కుట్రలు చేస్తున్నారంటూ వారు ఆరోపించారు. ఈ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఎంతోకాలంగా ఆ స్థలాల్లో దేవాదాయ శాఖ అధికారులు అనుమతితో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తప్పుడు పత్రాలను సష్టించి కొంత మంది కోట్లాది రూపాయాలు విలువ చేసే భూమిని కాజేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అనంత పద్మనాభ స్వామి దేవాలయ ఈవో నాగేంద్ర సైతం అక్కడికి వచ్చి ఆందోళనకు మద్దతు పలికారు. ఆలయాల భూముల పరిరక్షణ కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. లేపాక్షి రోడ్డులోని నానెప్ప నగర్ డిబి కాలనీ మధ్య లో గల అనంత పద్మనాభ స్వామి దేవాలయంకు చెందిన రెండు ఎకరాలు పైన గల స్థలం సుమారు రూ.40 కోట్ల విలువ చేస్తుందని చెప్పారు. అనంత పద్మనాభ స్వామి ఆస్తిని కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రవి, వెంకటేష్, చంద్ర, ఇమ్రాన్ తదితర దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న దుకాణాల నిర్వాహకులు

ఉపాధ్యాయులపై కక్షసాధింపు తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రభుత్వం కావాలనే ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణి ప్రదర్శిస్తోందని ఇది తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ విమర్శించారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పిఆర్‌సి సమయంలో క్యాడర్ స్ట్రెంత్ నిమిత్తం లేకుండా వేతనాలు వేసిన ప్రభుత్వం ఈ సమయంలో ఉన్న క్యాడర్ స్ట్రెంత్ తీసివేసి, కొత్తగా క్యాడర్ స్ట్రెంత్ ను తీసుకొచ్చి ఉపాధ్యాయుల ను గందరగోళానికి గురి చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ట్రెజరీ అధికారులు, డిఇఒ కార్యాలయ అధికారులు సమన్వయముతో ఉపాధ్యాయుల వేతనాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

28వ వార్డు కేతిరెడ్డి సూర్య ప్రతాపరెడ్డి కాలనీలో రామాలయ నిర్మాణం కోసం తన వంతుగా 50వేల రూపాయల విరాళం అందజేసినట్లు వైసిపి 28వ వార్డు ఇన్‌ఛార్జి సరితాల భాష తెలిపారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు సరితాలబాషాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విరాళాన్ని అందజేస్తున్న 28వ వార్డు ఇన్‌ఛార్జి సరితలబాషా

రాజీ మార్గమే లోక్ అదాలత్ లక్ష్యం

సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తి, న్యాయవాదులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాజీ కాగల కేసులకు లోక్ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 9 వ తేదీన జరగనున్న మెగా లోక్ అదాలత్ ను పురస్కరించుకుని బుధవారం పుట్టపర్తి కోర్టు చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లక్ష్యాలను వివరించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి తగాదాలు, మనస్పర్థలతో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని ధనాన్ని వృధా చేసుకుంటున్నారని అన్నారు. ఇలాంటి వారి మధ్య సమన్వయం కుదిర్చితే రాజీ తో కేసులనుండి విముక్తులవుతారని వివరించారు. ప్రధానంగా లోక్ అదాలత్‌లో దీర్ఘకాలిక వ్యాజ్యాలకు కూడా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ విషయం పై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత మీడియా పై ఉందన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి రాకేష్

ప్రజల్లో ఉన్న అపోహలు తొలగితేనే రాజీ కేసుల సంఖ్య పెరుగుతుందన్నారు. వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అని జడ్జి రాకేష్ వివరించారు. ఈ నెల 9 వ తేదీ జరిగే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ రెడ్డి, పూజారి ప్రసాద్, యదుభూషన్, నాగేంద్ర, కృష్ణప్రసాద్, నాగార్జున, ఇందిర శేఖర్, బిందు మహేష్, మౌనిక, క్లర్క్ మారుతి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

10న టిడిపి నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరంలో ఈనెల 10న టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నియోజకవర్గ ము లోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల పట్టణ, రూరల్ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో, ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభానికి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

దేశాన్ని రక్షించుకుందాం...

ప్రజాశక్తి - నంబులపూలకుంట

రాష్ట్రాన్ని రక్షించుకుందాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఆగస్టు 17వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభమైన సిపిఐ ప్రచార బస్సు యాత్ర బుధవారం నంబులపూలకుంట మండలంలోకి ప్రవేశించింది. బస్సు యాత్రలో భాగంగా మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిపిఐ మండల కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో నాయకులు సత్యనారాయణమూర్తి, దుర్గాభవాని, రామాంజనేయులు, వేమయ్య యాదవ్, నక్కి లెనిన్ బాబు తదితరులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించేంతవరకు ఆందోళనలు

ప్రజాశక్తి మడకశిర

తమ సమస్యలు పరిష్కరించేదాకా దశలవారీగా ఆందోళనలు చేపడతామని తాగునీటి పథకం కార్మికులు, సిఐటియు నాయకులు హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం యూనియన్ హిందూపురం డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారానికి 9వ రోజుకు చేరుకుంది. పట్టణంలోని శ్రీరామి రెడ్డి తాగునీటి పథకం కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ధర్మవరంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు

గోరంట్లలో శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభోదా సేవాసమితి ఆధ్వర్యంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కదిరి టౌన్ : శ్రీకృష్ణాష్టమి వేడుకలను స్థానిక శ్రీ షిర్డి సాయి హై స్కూల్ ప్రాంగణంలో కరస్పాండెంట్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్తచెరువులో వేణుగోపాల స్వామి ఆలయం, వివేకానంద పాఠశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధానంద సేవాసమితికి చెందిన నాగేంద్ర, అలివేలమ్మ, పద్మావతి, కల్పన, సాయి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : మండల పరిధిలోని నీలకంఠాపురంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి మెంబర్ మాజీ మంత్రి రఘురారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీ వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోరంట్ల రూరల్ : మండలం లోని మల్లాపల్లి గ్రామంలో గల రాధాకృష్ణ ఆశ్రమంలో బుధవారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పెనుకొండ శాసన సభ్యులు మాలగుండ్ల శంకర నారాయణ పాల్గొన్నారు, ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్, రైతు విభాగం అధ్యక్షులు పాటూరి శంకర్ రెడ్డి, మల్లాపల్లి సర్పంచి శివానంద, మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, పట్టణ కన్వీనర్ ధనా రెడ్డి, సర్పంచి సరోజ నాగే నాయక్, అగ్రి డైరెక్టర్ లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలం సొసైటీ బ్యాంక్ రెండు ఎకరాల ఆవరణములో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహజంచారు. ఎంపిపి ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు హాజరయ్యారు.

కళాశాల ముందు ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నిబంధనలు పాటించని కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబందనలను పాటింకుండా సెలవు రోజుల్లో సైతం తరగతులు నిర్వహిస్తు, విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న నారాయణ కళాశాలపై ఇంటర్ విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికి సెలవు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తుండడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. విద్యాశాఖ అధికారులకు కార్పోరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నిహాల్, హర్ష కుమార్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో విశాఖ భక్తులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విశాఖపట్నం జిల్లా నుంచి సుమారు 2 వేల మంది సత్యసాయి భక్తులు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. ఈ మేరకు వారు పర్తి యాత్ర పేరుతో పుట్టపర్తికి బుధవారం చేరుకున్నారు. శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ప్రశాంత నిలయంలో వేడుకలు చేసుకోవాలని ఇక్కడికి తరలివచ్చారు. వీరంతా ప్రశాంతి నిలయంలోనే బస చేశారు. సాయంత్రం సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ విశాఖపట్నం భక్తులను కలిసి అభినందించారు.

పుట్టపర్తిలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ మేరకు గ్రామస్తులు మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి నీరు సరిగా రావడం లేదని, రెండు బోర్లు ఉన్న ఉపయోగం లేదని వాపోయారు. సత్య సాయి నీరు వస్తేనే ఊర్లో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. దీంతో విధి లేని పక్షంలో చిత్రావతిలోని మురుగునీరు తీసుకుని వెళ్తున్నామన్నారు. 250 గృహాలు గల ఈ వార్డులో ఒక బోరు నుంచి వచ్చే నీళ్ల ఎక్కడ సరిపోతాయని వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

లారీనుంచి ఎగిసి పడుతున్న మంటలు

లారీలో అగ్నిప్రమాదం

రూ.60 లక్షల విలువజేసే సెల్‌ఫోన్ బ్యాటరీలు దగ్ధం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ సమీపంలోని కొల్లకుంట ఫ్లైఓవర్ వద్ద ఆకస్మాత్తుగా లారీలో బుధవారం అగ్నిప్రమాదం సంబవించింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.60వేల విలువ చేసే సెల్ ఫోన్ బ్యాటరీలు దగ్ధం అయ్యాయి. ఢిల్లీ నుంచి హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమకు సెల్ ఫోన్ బ్యాటరీలను లారీలో తీసుకెళ్తున్నారు. కొల్లకుంట ఫ్లైఓవర్ వద్దకు రాగానే లారీలో అనూహ్యంగా మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా లారీలో ఉన్న బ్యాటరీలతో మంటలు వ్యాపించాయి. సుమారు రూ.60 లక్షల ఆస్తి నష్టమైనట్లు డ్రైవర్ రాహుల్ తెలిపారు. ప్రమాదం ఎలా సంభవించిందన్న కోణంలో నిర్ధారించేందుకు ఢిల్లీలోని బ్యాటరీల సంస్థకు సమాచారం ఇచ్చినట్లు డ్రైవర్ తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను ఆర్పారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించకుండా ఉంటే లారీసైతం మంటల్లో తగలబడిపోయేది.

కరపత్రాలు విడుదల

ఓబుల దేవర చెరువు : సిఐటియు ఆధ్వర్యంలో కర్నూల్ లో జరుగుతున్న రాష్ట్ర వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని సిఐటియు ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు నాయకులు వర్క్‌షాప్‌కు సంబందించిన కరపత్రాలను మండల పరిధిలోని ఆటో స్టాండ్ వద్ద బుధవారం విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు ట్రాన్స్‌పోర్ట్ రంగం జిల్లా కార్యదర్శి బాబా, వివి రమణ, కుళ్లాయప్ప, రామాంజనేయులు, అంజి, రమణ, మురళితదితరులు పాల్గొన్నారు.

నీలకంఠాపురం ఆలయాన్ని సందర్శించిన కేజీఎఫ్ డైరెక్టర్

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండలంలోని నీలకంఠాపురం ఆలయాన్ని అదే గ్రామానికి చెందిన సినీ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ బుధవారం సందర్శించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రశాంత్‌నీల్ తండ్రి సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి సతీమణి సునీత తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : సామకోటి

బుక్కపట్నం : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆపార్టీ సత్య సాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. బుధవారం ఉమ్మడి జిల్లా పర్యటనలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకొస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు.

8 నుంచి క్రికెట్ టోర్నీ

కొత్తచెరువు : వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఈనెల 8వ తేదీ పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలో వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు వైసిపి యువ నాయకులు కొత్తకోట చక్రధర్ రెడ్డి, మాజీ సర్పంచి లోచర్ల రాజారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే వంద జట్లు పేర్లు నమోదు చేసుకున్నయని ఇంకా ఎవరైనా ఉన్నా నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

కదిరి టౌన్ : జి సిద్ధరామేశ్వర మహా సంస్థాన గురు పీఠం పీఠాధిపతి సిద్ధ రామేశ్వర స్వామీజీ చేతుల మీదుగా డాక్టర్ మదన్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పట్టణంలోని కోర్టు రోడ్డులో గల రిషిత చిన్న పిల్లల హాస్పిటల్ వద్ద మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ మదన్ కుమార్, సివి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పెనుకొండ : సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు యం. రుద్రేష్ అధ్యక్షతన సమావేశం ను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న జీవో నెంబర్ 117 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నాగరాజు, రుద్రేష్, జి. రామాంజినేయులు, రంగేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బాబు'తోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

ధర్మవరం టౌన్ : భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు గ్యారెంటీ అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ-బాబు షూరిటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు కో ఆర్డినేటర్ మాధవరెడ్డి, వార్డు అధ్యక్షులు అడ్రామహేశ్, 217 బూత్ కన్వీనర్ విశ్రాంత జైలర్ వెంకటేష్ ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి వివరించారు.

తోపుడు బండ్లు జాతీయ రహదారిపైకి వస్తే చర్యలు

ముదిగుబ్బ : మండలం కేంద్రంలో నాలుగు కూడళ్ల సర్కిల్ జాతీయ రహదారిపై తోపుడు బండ్లు తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామని సిఐ యతీంద్ర హెచ్చరించారు. జరిమానాలు విధిస్తామని తెలిపారు.

నేడు అమరాపురంలో ఎమ్మెల్యే పర్యటన

మడకశిర: నియోజకవర్గ పరిధిలోని అమరాపురంలో టీటీడీ బోర్డు మెంబర్‌చ ఎమ్మెల్యే తిప్పేస్వామి గురువారం పర్యటించనున్నారని పార్టీ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి ఎంపీపీ ఈరన్న తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు శివకుమార్, పేలుబండ ప్రసాద్ ,గడ్డం రాజు, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం వాలంటీర్ల అరెస్టు సిగ్గుచేటు

ప్రజాశక్తి కదిరి టౌన్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో వాలంటీలర్లను అరెస్టు చేయడం సిగ్గుచేటని టిడిని జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్ విమర్శించారు. బుధవారం కదిరి పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నారా లోకేష్ యువగళం పేరుతో శాంతియుతంగా పాదయాత్ర కొనసాగిస్తున్నారన్నారు పాదయాత్ర ప్రారంభమైనప్పటి నుంచి వైసిపి ప్రభుత్వం పాదయాత్రకు పోలీసుల ద్వారా వైసీపీ గుండాల ద్వారా అడ్డుకోవడానికి అనేక ఇబ్బందులకు సృష్టిస్తోందని విమర్శించారు. ప్రజల స్పందన చూసి భయపడుతున్న వైసిపి ప్రభుత్వం యువగళం యాత్రను అడ్డుకోవటానికి విఫలయత్నం చేస్తోందని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ నాయకులపైన, కార్యకర్తల పైన, వాలంటీర్లపైన నమోదు చేసిన అక్రమ కేసులు ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.